క్లుప్తంగా

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన



ముప్పాళ్ళ: విద్యార్థి దశలోనే సమాజ సేవా దృక్పథాన్ని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అసోసియేట్ జి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు జాతీయ సేవా పథకంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఆరవ తరగతి విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కె.నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెల్ల రాల్చు పురుగు ఉధృతి

ముప్పాళ్ళ: వరి పంటకు రెల్ల రాల్చు పురుగు ఆశించిందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. శుక్రవారం ముప్పాళ్ళ, మాదల, చాగంటివారిపాలెం గ్రామాల్లోని వరి పంటను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. రెల్ల రాల్చు పురుగు నేల పగుళ్ల, మొక్క మొదళ్లలో దాక్కొని పంటకు రాత్రి వేళ నష్టం చేస్తుందన్నారు. ఆలస్యంగా కోతకు వచ్చే రకాల్లో ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుందని చెప్పారు. వరి కోత సమయం 15-20 రోజులు సమయం ఉన్నట్లయితే వేప నూనె 3 ఎం.ఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.

వసతి గృహం వార్డెన్‌గా సుమణి



సత్తెనపల్లి: స్థానిక వెంకటపతి నగర్‌లోని ఎస్సీ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం సంక్షేమ అధికారిగా(వార్డెన్) పాలెపోగు సుమణి నియమితులయ్యారు. ఆమె బదిలీపై మాచర్ల నుంచి వచ్చారు. వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు యత్నించిన క్రమంలో..కలెక్టర్ అరుణ్‌బాబు ఇక్కడ పనిచేస్తున్న పంగులూరి రాణిమ్మను మాచర్లకు బదిలీ చేశారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

మురుగు నిల్వ లేకుండా చూడాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.రవి



ముప్పాళ్ళ: మురుగు నీరు సైడ్ కాల్వల్లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.రవి ఆదేశించారు. ముప్పాళ్ల ఎస్సీ కాలనీని శుక్రవారం ఆయన సందర్శించారు. కాలనీలో చర్చి వద్ద ఉన్న బావి నుంచి వాడుకునే మంచినీటి పైపులను సైడు కాల్వల్లో వేసి ఇళ్లకు వాడుకుంటున్నారని, నీరు కలుషితమై రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. చేతి పంపు నీటిని పరీక్ష చేయించాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, క్లస్టర్ అధికారి చంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డామియేన్, జోస్ఫిన్‌రాణి, ఎఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా నటికి ఘన నివాళి



సత్తెనపల్లి: మహా నటి సావిత్రి 93వ జయంతిని పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించారు. అక్కడ సావిత్రి విగ్రహానికి అభిమానులు పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. సావిత్రి అభిమాని కంఠమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 11 ఏళ్లకే నృత్యం నేర్చుకొని అనేక ప్రదర్శనలు ఇచ్చి తన పెదనాన్న ప్రోత్సాహంతో సినీ రంగంలోకి మహానటి ప్రవేశించిందన్నారు. పత్రి మెమోరియల్ ఘంటసాల కళానిలయం అధ్యక్షుడు గంగారపు వెంకటరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి యిర్మీయా, ఏఐటీ యూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సిద్ధార్థ శ్రీనివాస్, సీతారామయ్య, జింకా సూరిబాబు, రాజారెడ్డి, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాస రావు, జనార్దన్‌రావు ఉన్నారు.

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

రాజుపాలెం: విద్యా రంగానికి దాతల సాయం అవసరమని నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ అధ్యక్షుడు కోనేటి నర్సింహారావు అన్నారు. దేవరంపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు శుక్రవారం పంపిణీ చేశారు. ఏపీ ఇన్‌చార్జి గరికపాటి శంకరరావు మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు కోటా బాబూరావు, మీడియా కో-ఆర్డినేటర్ పాగళ్ల పూర్ణచంద్రరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు తులశమ్మ, ప్రశాంతి పాల్గొన్నారు.

స్త్రీ నిధికి చెదలు

- రుణాలకు నోచుకోని డ్వాక్రా మహిళలు
- రికవరి సొమ్ము స్వాహా చేసిన వెలుగు సిబ్బంది
- బకాయిలు పేరుకు పోవడంతో ఆగిపోయిన కొత్త రుణాలు
- బాధ్యులపై విచారణలే కానీ, చర్యలు శూన్యం

అచ్చంపేట: అందరూ శాకాహారులే కానీ కుండలో మాంసం కూర ఎవరు తిన్నారన్న ప్రశ్న మాదిరిగా.. తయారైంది స్త్రీ నిధి రుణాల రికవరీ పరిస్థితి. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేసింది. వాటిని వారు తిరిగి చెల్లించేశారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ, ఆ చెల్లించిన నగదు మాత్రం బ్యాంకుల్లో జమ కాలేదు. ఇందులో వెలుగు సిబ్బంది హస్తం మొత్తం ఉంటే..రాజకీయ నాయకుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు, వారి కాళ్లపై వాళ్లు నిలబడేందుకు స్త్రీ నిధి బ్యాంకు ద్వారా ప్రభుత్వం 2017 - 2022 వరకు రూ.12 కోట్ల రుణాలిచ్చింది. ఈ రుణాలు బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచి వచ్చాయి. వీటిని వాయిదాల పద్ధతిలో రెండేళ్ల కాల పరిమితిలో చెల్లించాలి. నిజమైన లబ్ధిదారుల నుంచి రూ.9 కోట్ల రుణాలు వసూలు కాగా, బినామీ పేర్లతో తీసుకున్న రూ.3 కోట్ల బకాయిలు మాత్రం పేరుకుపోయాయి. వివిధ స్కీంల కింద మహిళలకు మరో రూ.3 కోట్లకు పైగా రుణాలు పంపిణీ చేశారు. ఇందులో ఇప్పటి వరకు ఎంత మొత్తం రికవరి చేశారు..? ఇంకా ఎంత చేయాలి..? రికవరి చేసిన సొమ్మును బ్యాంకుల్లో జమ చేశారా? లేక వెలుగు సిబ్బంది, అప్పటి నాయకులు భోంచేశారా..? ఇన్ని ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలు రావాల్సి ఉంది. కాని సంబంధిత గ్రూపు మహిళలు మాత్రం తాము చెల్లించాల్సిన బాకాయిలు ఎప్పుడో చెల్లించామని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు పీఓపీ(పూరెస్ట్ ఆఫ్ పూర్) కింద రూ.2 కోట్లు ఇచ్చారు. ఇందులో ఎంత మొత్తం రికవరీ చేశారన్న దానికి అతీగతీ లేదు. మానవాభివృద్ధి (హ్యూమన్ డెవలప్‌మెంట్) రుణాల్లో రూ.40 లక్షలు, సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్) రూపంలో ఇచ్చిన రుణాల్లో రూ.43 లక్షలు ఇంకా బకాయిలున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ రికవరి అయితే చేశారు గాని, సంబంధిత బ్యాంకుల్లో జమచేయకపోవడం గమనార్హం.

> గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై లింగ వివక్షతను నిర్మూలించి, వారిని అభివృద్ధి చేయడానికి డ్వాక్రా (డెవలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఇన్ రూరల్ ఏరియాస్) కార్యక్రమాన్ని 1982, సెప్టెంబరులో అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం ముఖ్య ఉద్దేశం మహిళల జీవన పరిస్థితులను మెరుగు పరచడం, తద్వారా పిల్లల ప్రాథమిక, సామాజిక సేవలకు స్వయం ఉపాధి కల్పించడం. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు సంబంధిత రంగాల్లో శిక్షణ నిచ్చి, స్వయ ఉపాధి కోసం రుణ సౌకర్యం కల్పించడం. దీంతో జీవనోపాధి కల్పించడమే కాకుండా వారినిలో మానసిక ఆత్మస్థైర్యాన్ని నింపడం ముఖ్య ఉద్దేశం.



అచ్చంపేట వెలుగు కార్యాలయం

> **ఇంకా రూ.50 లక్షలే బకాయి**
>
> నేను 2022లో ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు తీసుకున్నా. అప్పటికే బాకాయిలు పేరుకు పోవడంతో కొత్త రుణాలు మంజూరు కాలేదు. రుణాలు ఎవరు తీసుకున్నారు, లబ్ధిదారులకు చేరాయా లేదా అనే విషయంపై విచారణ చేపట్టాం. సంబంధిత సీసీలు, వీవోఏలకు నోటీసులు ఇచ్చాం. చాలా భాగం వసూలు చేశాం. స్త్రీ నిధి రుణాలు రూ.50 లక్షలే వసూలు చేయాల్సి ఉంది. మిగిలిన రుణాలను త్వరలో వసూలు చేస్తాం.
>
> – షేక్ సలీం, ఏపీఎం, అచ్చంపేట

విచారణలే.. చర్యలు లేవు..

గత ఏడాది కాలంలో రుణాల రికవరీపై మూడు నాలుగు సార్లు డీఆర్‌డీఏ అధికారులు విచారణ కమిటీలను వేశారు. స్త్రీ నిధి రుణాల్లో కేవలం రూ.కోటి మాత్రమే బకాయి ఉందని ఒకసారి, రూ.92 లక్షలని మరోసారి, రూ. 76 లక్షలు ఇంకోసారి, చివరి విచారణలో రూ.72 లక్షలని, తాజాగా ఇప్పుడు కేవలం రూ.50 లక్షలు మాత్రమే బకాయి ఉందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఎంత బకాయి ఉందనే విషయాన్ని విచారణ సిబ్బంది, వెలుగు సిబ్బంది, జిల్లా ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. వీటికి సంబంధించిన సీసీలు (కమ్యూనిటీ కో-ఆర్డినేటర్స్), వీవోఏలు(విలేజ్ ఆర్గనైజేషన్స్ అసిస్టెంట్స్)కు నోటీసులు ఇచ్చారు.

ఆగిపోయిన కొత్త రుణాలు

రుణాల రికవరీలో అవకతవలు జరిగినట్లు విచారణలో స్పష్టం కావడంతో.. కొంత మందికి మాత్రమే నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. దాని పర్యావసానంగా డ్వాక్రా గ్రూపులకు కొత్త రుణాలు లేవు. స్త్రీ నిధి రుణాలను నిలిపివేశారు. పీఓపీ, హెచ్‌డీ, సీఐఎఫ్ రుణాల మంజూరే కావడం లేదు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

క్రోసూరు: పత్తి పంట ధ్వంసం చేసిన నిందితులందరినీ అరెస్ట్ చేయలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు క్రోసూరు సీఐ సురేష్, ఎస్ఐ నాగేంద్రరావును ఆదేశించారు. శుక్రవారం క్రోసూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. స్టేషన్ వద్ద వేచి ఉన్న ఫిర్యాదుదారులను పిలిపించి మాట్లాడారు. దొడ్లేరు గ్రామానికి చెందిన సైదా తన పత్తిపంటను కొందరు ధ్వంసం చేసారని గతవారం ఎస్పీ సెల్‌లో ఇచ్చిన ఫిర్యాదు గురించి గుర్తుచేసారు. దీనిపై ఎస్ఐను వివరాల కోరగా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పంట ధ్వంసంలో పాల్గొన్న వారందరినీ వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత



అచ్చంపేట: కొత్తపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థికి తెల్లమేకల అంకమ్మరావుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేసింది. స్థానిక సంక్షేమ బాలుర కళాశాల ప్రిన్సిపల్ అరుణ్ కుమార్ రూ.25 వేల నగదును అంకమ్మరావుకు అందజేశారు. గుంటూరు చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి హాస్టల్ ఖర్చుల నిమిత్తం నగదు అందజేసినట్లు స్నేహహస్తాలు ప్రతినిధి తాయి కరిముల్లాబాబు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



మాదిపాడులో స్పందనలేని రెవెన్యూ సదస్సు

సత్తెనపల్లి: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని డిప్యూటీ తహసిల్దార్ ఎన్.రవికుమార్ అన్నారు. పెదమక్కెన గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ రవికుమార్ పాల్గొని, పట్టాదారు పాస్ పుస్తకం కోసం-2, అడంగల్‌లో విస్తీర్ణం నమోదు -2, సర్వే కొలతకు-1, సామాజిక పింఛన్‌కు-10, రైస్ కార్డుల కొరకు-14, మొత్తం 29 అర్జీలు ప్రజలు స్వీకరించారు. సర్వేయర్ వై.శ్రీనివాసరావు, ఈఓ కె.రామకోటిరెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ బోసుబాబు, గ్రామ రెవెన్యూ అధికారి జైపాల్, ,గ్రామ సర్వేయర్ రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

అచ్చంపేట: తమ సేద్యపు భూములకు తాశీలు చెల్లించి రెండేళ్లు అయ్యిందని, చెల్లిస్తామని ఎన్ని సార్లు వీఆర్వోను అడిగినా తీసుకోవడం లేదని మాదిపాడు గ్రామ రైతులు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా శుక్రవారం మాదిపాడులో నిర్వహించిన సదస్సుకు గ్రామస్తులు, రైతుల నుంచి స్పందన కరువైంది. గ్రామంలోని అగ్రహారం భూములను తాము నలభై ఏళ్ల క్రితం జమిందారుల నుంచి కొనుగోలు చేసి సేద్యం చేసుకుంటున్నామని, కాని తమకు ఈ రోజు వరకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదని రైతులు తెలిపారు. దీనిపై విచారణ జరుపుతామని, ఏటా తాశీలు చెల్లించుకుంటామని, ఉమ్మడి ఆస్తులను ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. సదస్సులో 32 దరఖాస్తులను స్వీకరించినట్లు చెప్పారు. భూమి హెచ్చు తగ్గులపై 18, పాసు పుస్తకాల కోసం 4, సర్వే కొలతల కోసం 9, చంద్రన్న బీమా కోసం 1 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

క్రోసూరు: మండలంలోని 88త్యాళ్లూరు, ఉయ్యందన గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో 20 అర్జీలు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి డి.శివన్నారాయణ తెలిపారు. 88త్యాళ్లూరు-4, ఉయ్యందన గ్రామంలో 16 అర్జీలు వచ్చినట్లు వచ్చాయి. క్రోసూరు దేవాదాయశాఖ ఈవో రంగసెట్టి సూరినారాయణ మాట్లాడుతూ మండలంలో దేవదాయశాఖ భూములు అనేకం ఆన్‌లైన్ కాలేదని, వాటిని ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు సంబంధిత దేవస్థానం పేర ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ జింకాశ్రీనివాసరావు, వీఆర్వో రాజ్‌కుమార్, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

బెల్లంకొండ: తహసీల్దారు అఫ్రపున్నీసా బేగం శుక్రవారం నాగిరెడ్డిపాలెం గ్రామంలో మొదటిరోజు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఆర్ఐ పవన్ కుమార్, దేవదాయ శాఖ అధికారి రామకోటి రెడ్డి, గ్రామ నాయకులు వెన్నా సీతారామిరెడ్డి, వెంకట్ రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ దుర్గేష్‌రావు పాల్గొని భూ సమస్యలపై 56 దరఖాస్తులు, రేషన్‌కార్డులలో మార్పులు, చేర్పుల కోసం 4 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమారాణి, డిప్యూటి తహసీల్దార్ జానీబాష, వీఆర్వో వాణి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి మంత్రి రవికుమార్, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ



అచ్చంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకుల నివాళి

సత్తెనపల్లి: బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యాన్ని తీసుకు వచ్చిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. తాలూకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గుజ్జర్లపూడి కృపాకర్, యాసారపు బాబు, అఖిల్, నాయకులు అచ్యుత శివప్రసాద్, గుజ్జర్లపూడి సతీష్, గుజ్జర్లపూడి చంటి, జూపల్లి పాల్, కాటుమాల డేవిడ్, వల్లెం నరసింహారావు, ఉల్లంగుల ప్రసాద్ బాబు, గొల్లపల్లి రాము ఉన్నారు.

- మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మాలే పద్మారావు పట్టణంలోని పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహలకు శుక్రవారం నివాళులర్పించారు. టౌన్ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబు, సల్లగాల మృత్యుంజయరావు, కోడిరెక్క దేవదాసు, దావులూరి కోటేశ్వరరావు, పెండెం బాబురావు, జూపల్లి పాల్, దాసరి జ్ఞానరాజుపాల్, జడ ప్రసాదు, కాటుమాల ప్రభాకర్, పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాతంగి సుధాకర్, ముప్పాళ్ళ అధ్యక్షుడు సేవ చంద్ర, గంజిమాల రాజారావు పాల్గొన్నారు.
- ఏఎంసీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు రెంటపాళ్ళలోని ఎస్సీ కాలనీలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ ఏకుల మనీషా, నాయకులు ఏకుల పెద్ద మత్తయ్య, పల్లె గాబ్రియేల్, పల్లె ఏసుదాస్, పల్లం సుబ్బయ్య, తాటిమళ్ళ వెంకట్రావు, కట్టా దేవ దానం పాల్గొన్నారు.

అచ్చంపేట: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని అంబేడ్కర విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఎంపీపీ కంగసాని బాబు, ఎంపీటీసీ తెల్లమేకల నాగరాజు, షేక్ నాగులు, ఆలా శ్రీనివాసరావు, సందెపోగు పున్నారావు, పూల వెంకటేశ్వర్లు, షేక్ సైదావలి పాల్గొన్నారు. బీఆర్ అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. సంస్థ వ్యవస్థాపకులు చిల్కా చంద్రయ్య, సరికేటి సింహరాయలు, శిఖా నరసింహారావు, తిరువాయిపాటి ఆంజనేయులు, సందెపోగు వెంకట్రావు పాల్గొన్నారు.

నకరికల్లు: చేజర్ల గ్రామంలోని ఎస్ఏవీఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ షేక్.హసన్ అధ్యక్షత వహించారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్.ఫాహిం, ఉపాధ్యాయులు ఎస్.లలిత, పి.మాలిక, చెరుకూరి వెంకటేశ్వర్లు, షేక్.మస్తాన్‌వలి, గేరా మోహన్‌రావు, ఏసీహెచ్ వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లిలోని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎస్పీ కంచి శ్రీనివాస రావు, సత్తెనపల్లి ఆర్డీవో జీవీ.రమణా కాంత్‌రెడ్డి ఉన్నారు.

అమరావతి: సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు శుక్రవారం దళిత ప్రజా సంఘాల అధ్వర్యంలో సత్తెనపల్లి రోడ్డు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. దారా ప్రసాద్, తాటిబోయిన సుబ్బారావు, వెంకటేశ్వరరాజు, తోకల సూరిబాబు, మొహిద్దీన్ ఉన్నారు. శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ రాజశేఖర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు మాజేటి రాము, రఘు పాల్గొన్నారు.

క్రోసూరు: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చిలకా భాస్కరరావు. ఎంపీటీసీ చిలక రవికుమార్, చిలక దాసయ్య, కిన్నెర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్వరలోనే పల్నాడులో సీబీజీ ప్లాంట్

- రైతులకు, నిరుద్యోగులకు ఉపయుక్తంగా రిలయన్స్ ప్రాజెక్టు
- 16,400 ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్
- వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఉండవు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



ఆల్క లీన్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, పక్కన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: సత్తెనపల్లి ప్రాంతంలోని రైతులు సుముఖంగా ఉంటే రిలయన్స్ కంపెనీ సీబీజీ (బయోగ్యాస్) ప్లాంట్ త్వరలో ఏర్పాటుకు చర్యలు చేపడతామని రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణతో కలిసి ఫణిదం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన ఆల్కలీన్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. రిలయన్స్ కంపెనీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జరిపిన చర్చల ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 500 సీబీజీ (బయో గ్యాస్) ప్లాంట్లు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి కనిగిరి, దర్శి, మార్కాపురం వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా సత్తెనపల్లి ప్రాంతంలో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ ప్రాంతంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు అయితే రైతులకు ఆర్థిక చేయూతతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. 16,400 ఉద్యోగాలతో త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుందన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించమని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం

కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్థానిక రఘురామ్ నగర్‌లో రూ.1.30 కోట్లతో ఏర్పాటు చేసిన ఆల్కలీన్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రశంసించారు. రాష్ట్రంలోనే సామాజిక అవసరాల కోసం ఆల్కలీన్ ప్లాంట్ సత్తెనపల్లిలో తొలిసారిగా ఏర్పాటైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు, రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురు కుల పాఠశాలలకు ఆల్కలీన్ వాటర్‌ను అందించబోతున్నట్లు చెప్పారు. క్రమంగా నియోజకవర్గ అంతా ఈ సేవలను విస్తరిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి సేవ మిగిలిన వారిలో ప్రేరణ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు మాజీ మేయర్ కన్నా నాగరాజు, నాయకులు, అధికారులు ఉన్నారు.

సామగ్రి బహూకరణ

పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన సామగ్రిని అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో పలువురు దాతలు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన ఇన్వర్టర్‌ను శుక్రవారం అందించారు. ఒకటి కొత్త లక్ష్మయ్య, మరొకటి దేవతి సుబ్బారావు అందించగా 60 దుప్పట్లు ,60 దిండ్లు, దిండు కవర్లు శిరసాల భుజంగరావు, 20 ప్లాస్టిక్ కుర్చీలు మద్ది వెంకటేశ్వరరావు, మరో 20 ప్లాస్టిక్ కుర్చీలు మారెళ్ళ మల్లేశ్వరరావులు బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే కన్నా క్ష్మీనారాయణ, వైద్యులు ధర్మసింగ్ శాస్త్రీ, ఆసియా పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నకరికల్లు: మొబైల్ ఫోన్ మరమ్మతులు చేయించుకొని వస్తానని వెళ్లి వ్యక్తి తిరిగి రాకపోవడంతో బంధువులు పోలీసులకు శుక్రవారం పిర్యాదు చేశారు. ఎస్ఐ చల్లా సురేష్ మాట్లాడుతూ హరియాణాలోని కోట్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఇలియాస్ డిల్లీ నుంచి చెన్నైకి లోడు లారీ తీసుకొస్తున్నాడు. గత నెల 30న నకరికల్లు సమీపంలోని హరియాణా దాబా వద్ద లారీని ఆపాడు. ఉదయం సెల్‌ఫోన్ రిపేర్ చేయించుకొని వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వెతికిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలియాస్ ఆచూకీ తెలిసిన వారు 94407 96246, 86398 48404, 94407 96222 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

అవగాహనే ఆయుధం

క్రోసూరు: వరల్డ్ ఎయిడ్స్ డే వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం క్రోసూరు మండలం దొడ్లేరులో ప్రదర్శన,అవగాహన జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భూలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త అనుపమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలి



బ్యాగులను అందజేస్తున్న సంస్థ సభ్యులు

బెల్లంకొండ: చైత్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రవికుమార్ శుక్రవారం స్థానిక కేజీబీవీలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గతేడాది పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న ముగ్గురు విద్యార్థులకు ట్రస్టు రూ.10 వేలు నగదు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న బాలికలకు కాస్మెటిక్స్, కాలేజీ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణి, సర్పంచులు ఆసుల జగన్, గడిపర్తి జ్యోతి సముద్రం, పాఠశాల చైర్మన్ కొండలు, ట్రస్ట్ సభ్యులు మార్కండేయులు, రాజ్యలక్ష్మి, సామ్రాజ్యం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వర్టికల్ టెలివిజన్ ఏర్పాటు



టీవీని ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాసరావు

అమరావతి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం మీతో మేము అనే కార్యక్రమంలో భాగంగా వర్టికల్ టెలివిజన్‌ను సీఐ ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వివిధ పనుల మీద వచ్చిన వారికి, సైబర్ నేరాలు, మహిళలపై దాడులు, నార్కొటిక్ డ్రగ్స్ నేరాలకు సంబంధించి అవగాహన కల్పించటానికి వర్టికల్ టీవీ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇందులో 24గంటలూ అవగాహన కార్యక్రమాలు ప్రసారమవుతాయన్నారు. ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: ఐసీడీఎస్ క్రోసూరు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఉమామహేశ్వరీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత పత్రాలతో ఈ నెల 18న సాయంత్రం 5 గంటల కల్లా 75 తాళ్లూరు కార్యాలయంలో దరఖాస్తులు అందచేయాలని సీడీపీవో పేర్కొన్నారు.

కృష్ణానది ఒడ్డున వృద్ధుడి ఆత్మహత్య

అమరావతి: స్థానిక కృష్ణానది ఒడ్డున అమరేశ్వర ఘాట్‌లో శుక్రవారం పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం సత్తెనపల్లి సమీపంలోని భీమవరం గ్రామానికి చెందిన యరపతినేని కోటేశ్వరరావు(63) అనారోగ్యంతో భాధపడుతు గురువారం మధ్యాహ్నం అమరావతి అమరేశ్వరాఘాట్‌కు చేరుకున్నాడు.. సుమారు నాలుగు గంటల సమయంలో కూల్‌డ్రింక్ బాటిల్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి అత్మహత్య చేసుకున్నాడు. కోటేశ్వరరావు భార్య పదేళ్ల క్రితం మరణించింది. నాలుగేళ్ల నుంచి మూర్ఛ వ్యాధితో భాదపడుతున్నాడు. కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.